తెలంగాణ యాస, భాషకు దుర్గతి

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్ల ఇష్టారాజ్యం ● తప్పనిసరి తెలుగు అమలు చేయని వైనం

భాషా వాచకాల వాడకంలోనూ నిర్లక్ష్యం ● ప్రత్యేక చట్టమున్నా విద్యాశాఖ అలసత్వం

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : ''మన సంస్కృతితో కూడిన పుస్తకాల ఆధారంగానే పిల్లలకు మన చరిత్రను, వైభవాన్ని, మనదైన జీవన విధానాన్ని పరిచయం చేయగలం'' ఇదే కోవలో బీఆర్ఎస్ సర్కారు రూపొందించిన తెలుగు వాచకాలను పలు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లు అటకెక్కిస్తున్నాయి. ఇంగ్లిష్ మోజులో తెలుగు పుస్తకాలను బోధించడం లేదు. కొన్ని స్కూళ్లు తెలుగు వాచకాలను వాడకపోగా, మరికొన్ని ఒక పుస్తకానికి బదులు ఇతర పుస్తకాలను వాడుతున్నాయి. మన పిల్లలకు తెలంగాణ యాస, భాషను దూరం చేస్తున్నారు. కొన్ని విద్యాసంస్థలు తెలుగుకు ద్రోహం తలపెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమ్మ భాష ఆదరణకు నోచుకోకపోయినా అధికారులు అలసత్వం వీడడంలేదని విద్యావేత్తలు, భాషాభిమానులు మండిపడుతున్నారు.

తెలుగుకు కేసీఆర్ వెలుగులు

బీఆర్ఎస్ ప్రభుత్వం 2018-19లో తెలుగు తప్పనిసరి అమలు చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం స్కూళ్లలో ఇంగ్లిష్‌తో పాటు ఇతర మీడియం విద్యార్థులు తెలుగును తప్పనిసరిగా అభ్యసించాల్సి ఉన్నది. 2018-19లో విద్యాసంవత్సరంలో ప్రాథమికస్థాయిలో 1వ తరగతిలో, ఉన్నతస్థాయిలో 6వ తరగతిలో తెలుగును అమలు చేశారు. ఇలా ఏడాదికి ఒక తరగతికి పెంచుకుంటూ వెళ్లారు. కేసీఆర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వం తెలంగాణ భాష, యాసతో తెలుగు పుస్తకాలను ముద్రించి, అందుబాటులోకి తీసుకొచ్చింది. స్టాండర్డ్ తెలుగు (తెలుగు భాష) తీసుకున్న వారి కోసం జాబిలి, నవవసంతం, సింగిడి పుస్తకాలను రూపొందించింది. ఇక కేవలం తెలుగును పరిచయం చేయడం కోసం, అది కూడా తెలుగేతర మీడియాల్లో చదువుతున్న వారి కోసం వెన్నెల, తేనెపలుకులు పుస్తకాలను ముద్రించింది.

ఒకదానికి బదులు మరోటి

సీబీఎస్ఈ స్కూళ్లల్లో 1-8 తరగతుల వరకు త్రిభాషా సూత్రం, 9, 10 తరగతుల్లో ద్విభాషా సూత్రం అమలవుతున్నది. అయితే 1-8 తరగతుల్లో కొందరు హిందీ, ఇంగ్లిష్, ఫ్రెంచ్/జర్మన్ వంటి భాషలు తీసుకుంటున్నారు. మరికొందరు ద్వితీయభాషగా తెలుగును తీసుకుంటున్నారు. ద్వితీయభాషగా తెలుగును తీసుకున్న వారు 1-5 తరగతుల్లో జాబిలి, 6-8తరగతులకు నవ వసంతం, 9, 10 తరగతులకు సింగిడి పేరుతో గల పుస్తకాలు చదవాల్సి ఉంది. అయితే తెలుగును చదవని వారు మాత్రం తప్పనిసరి తెలుగు అమల్లో భాగంగా మూడో భాషగా తెలుగును చదవాల్సి ఉంటుంది. ఇలాంటి వారు 1-5 తరగతుల్లో వెన్నెల, 6-10 తరగతుల్లో తేనెపలుకులు పుస్తకాలను చదవాలి. వీటిని సింపుల్ తెలుగు పుస్తకాలంటారు. అయితే పలు సీబీఎస్ఈ పాఠశాలల్లో రెండోభాషగా తీసుకున్న విద్యార్థులకు జాబిలి, నవవసంతం, సింగిడి పుస్తకాలకు బదులుగా మూడోభాషగా తెలుగు తీసుకున్న విద్యార్థుల కోసం రూపొందించిన వెన్నెల, తేనెపలుకులు పుస్తకాలను వాడుతున్నారు. ఇలా చేయడమంటే తెలుగు భాషకు తీరని ద్రోహం చేయడమేనని విమర్శలు వినిపిస్తున్నాయి.

సబ్జెక్టు కోడ్ కేటాయించిన సీబీఎస్ఈ

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ బోర్డు స్కూళ్లల్లో సింపుల్ తెలుగుకు వార్షిక పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధమయ్యింది. వెన్నెల (సింపుల్ తెలుగు) పుస్తకానికి సీబీఎస్ఈ లాంగ్వేజ్ గ్రూప్ -ఎల్‌లో 089 సబ్జెక్టుకోడ్‌ను జారీచేసింది. దీంతో 2025-26 విద్యాసంవత్సరంలో 9వ తరగతికి, 2026- 27 విద్యాసంవత్సరంలో పదో తరగతికి వార్షిక పరీక్షలను నిర్వహిస్తారు. వార్షిక పరీక్షలను నిర్వహించనుండటంతోనైనా తప్పనిసరి తెలుగు సక్రమంగా అమలుచేసేనా.. ? పాఠశాల విద్యాశాఖ సరైన పర్యవేక్షణ జరుపుతుందా..? లేదా ? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

డెడికేటెడ్ కమిషన్ నివేదికపై చర్యలేంటి?

'స్థానిక' రిజర్వేషన్లపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన కోసం ఏర్పాటైన డెడికేటెడ్ కమిషన్ విచారణ ఏ దశలో ఉన్నదో చెప్పాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ కమిషన్ విచారణ పూర్తయిందా? విచారణ పూర్తయితే నివేదికను సమర్పించిందా? అని ప్రశ్నించింది. నివేదిక అందితే ఎలాంటి చర్యలు చేపట్టారో వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. స్థానిక సంస్థల రిజర్వేషన్ల వ్యవహారంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రతిని కూడా అందజేయాలని పేర్కొంటూ.. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

మండే ఎండల్లో చల్లని కబురు

రెండు రోజులు భారీగా తగ్గనున్న ఎండలు : ఐఎండీ

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): భానుడి ప్రతాపానికి అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. నేడు, రేపు ఉదయం ఉష్ణోగ్రతలు 10 నుంచి 12 డిగ్రీల మధ్య ఉంటాయని, మధ్యాహ్నం 35-36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు. ఉత్తర భారతదేశం నుంచి ఆకస్మికంగా వీచే చలి గాలుల ప్రభావంతోనే ఉష్ణోగ్రతలు తగ్గుతున్నట్టు తెలిపారు.

కేసీఆర్ కట్టించిన సీతారామ ప్రాజెక్టే దిక్కు

- తొలిసారిగా సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు
- కాంగ్రెస్ వ్యతిరేకించిన ఆ ప్రాజెక్టే నేడు వరప్రదాయిని
- 'సీతారామ'తో పచ్చగా మారనున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా
- సాకారమైన బీఆర్ఎస్ అభినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల

ములకలపల్లి, మార్చి 5: కేసీఆర్ కట్టించిన సీతారామ ప్రాజెక్టు ఇప్పుడు దిక్కు అయ్యింది. ప్రతిపక్షంలో ఉన్నపుడు కాంగ్రెస్ వ్యతిరేకించినా ఆ ప్రాజెక్టే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయినిగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం యథేచ్ఛగా కృష్ణా జలాలను తరలించుకుపోయినా సాగర్ ఎడమ కాల్వ కింద ఉన్న మూడు లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారానే ఇప్పుడు జీవం వచ్చింది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయం అడుగంటి సాగర్ ఎడమ కాల్వ కింద ఆయకట్టు రైతులు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గోదావరి జలాలు సాగర్ కాల్వలో కలిసేలా రూపుదిద్దుకున్న సీతారామ ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన ఏన్కూరు కాల్వ ఎండిపోతున్న పంటలకు ఇప్పుడు శ్రీరామరక్షగా నిలిచింది. గోదావరి కృష్ణమ్మతో కలిసి ఉమ్మడి జిల్లా వ్యవసాయ భూముల్లో పరవళ్లు తొక్కింది. చాలీచాలని నీళ్లతో ఎండిపోతున్న యాసంగి పంటలను పసిడి పచ్చగా తీర్చిదిద్ది సిరులు కురిపించే అద్భుత దృశ్యం బుధవారం సాక్షాత్కరించింది. తెలంగాణ సాధకుడు, నిత్య కృషీవలుడు, రైతుల పక్షపాతి, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ స్వప్నం సాకారమైంది. సీతారామ ప్రాజెక్టులోని మూడో దశ పంపుహౌజ్ నుంచి 12 కిలోమీటర్ల మేర ఏన్కూరు కాల్వను తవ్వడం వల్ల గోదావరి జలాలు నేరుగా సాగర్ ఎడమ కాల్వకు తరలిపోతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం వేల కోట్లను సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేసి రాష్ట్రంపై అప్పుల భారాన్ని పెంచుతున్నారని కాంగ్రెస్ నాడు ప్రతిపక్షంలో ఉన్నపుడే కాదు.. ఇప్పటికీ విమర్శలు చేస్తూనే ఉన్నది. కానీ అది ఖర్చు కాదు... తెలంగాణ రైతాంగ శ్రేయస్సుకు వెచ్చించిన పెట్టుబడి అని తాజాగా రుజువైంది.

కృష్ణమ్మతో కలిసి గోదావరి పరవళ్లు

సాగర్‌లో నీటి లభ్యత తగ్గిపోవడంతో ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులకు సాగునీరు అవసరం తీవ్రంగా ఉంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో గోదావరి నదీ జలాలను నాగార్జున సాగర్ కాలువకు అనుసంధానం చేస్తూ ఈ నెల 3న సీతారామ చివరి పంప్‌హౌస్ ద్వారా గోదావరి జలాల లిఫ్టింగ్ ప్రక్రియను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. ఇక్కడి నుంచి గోదావరి నీళ్లు రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా బుధవారం సాగర్ ఆయకట్టుకు నీరు చేరాయి.

కేసీఆర్‌కు జనం నీరాజనం

ప్రత్యేక రాష్ట్రంలో జలవనరుల వినియోగాన్ని సమర్థవంతంగా చేసేందుకు కేసీఆర్ పాలనలో రూపుదిద్దుకున్న ప్రాజెక్టులో ప్రధానమైంది సీతారామ ప్రాజెక్టు ఒకటి. 2016లో ఎనిమిది వేల కోట్లు అంచనా వ్యయంతో మొదలైంది. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు నుంచి ములకలపల్లి మండలం కమలాపురం వరకు వంద కిలోమీటర్ల పొడవు కాల్వ పనులతోపాటు బీజీ కొత్తూరు, పూసుగూడెం, కమలాపురం గ్రామాల్లో మూడు పంప్‌హౌజ్‌ల నిర్మాణాలు 90శాతం పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. సీతారామ ప్రాజెక్ట్ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో సాగునీటి సౌకర్యానికి నోచుకోక పడావు పడిన లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేయనున్నది. ఇప్పటికే చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడంలేదని సాగర్ ఎడమ కాల్వ కింద రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ సమయంలో సీతారామ ప్రాజెక్టు వరప్రదాయినిగా లక్షలాది మంది రైతాంగాన్ని ఆదుకోవడంతో ఆయకట్టు రైతులు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. కేసీఆర్ ముందుచూపు సాగర్ ఆయకట్టుకు జీవం పోసినట్టుందని జనం నీరాజనాలు పలుకుతున్నారు.

కేసీఆర్ కృషి ఫలితమే.. సీతారామ ప్రాజెక్టు

మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో వెల్లడి

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): గోదావరి జలాలను ఒడిసి పట్టి, ఎత్తిపోయాలని దూరదృష్టితో కేసీఆర్ చేసిన ప్రయత్నమే సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు రూపకల్పన అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్రం కొర్రీలను, కాంగ్రెస్ కుట్రలను ఛేదించి వడివడిగా(90శాతం) పనులు పూర్తి చేశామని వివరించారు. సీతారామ ప్రాజెక్టు కోసం నాటి కేసీఆర్ ప్రయత్నాలు చేస్తుంటే కాంగ్రెస్ నేతలు వృథా ప్రాజెక్టు అని, అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేయించారని ఉదహరించారు. కేసీఆర్ పట్టుబట్టి సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయించారని వివరించారు. ఫలితంగానే నేడు కరువు కోరల్లో చిక్కుకున్న ఖమ్మం జిల్లా రైతులకు వరంగా మారిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించి సిద్ధంగా ఉంచిన సీతారామ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తూ ఫొటోలకు మంత్రులు, నాయకులు ఫోజులు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల సాగు, తాగునీటి కష్టాలకు సీతారామ ప్రాజెక్టు శాశ్వత పరిష్కార మార్గమని స్పష్టంచేశారు. ప్రత్యక్షంగా ఆరు లక్షల ఎనభై వేల ఎకరాలకు, పరోక్షంగా పది లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందుతున్నాయని ఎక్స్ వేదికగా వెల్లడించారు.

మురళీకృష్ణుడి అవతారంలో తిరుమాఢవీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

మురళీకృష్ణుడిగా లక్ష్మీనరసింహస్వామి

యాదగిరిగుట్ట, మార్చి 5: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి అలంకార సేవోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం యాదగిరీశుడికి నిత్యపూజా కైంకర్యం జరిగిన అనంతరం స్వామిని మురళీకృష్ణుడిగా అలంకరించి తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. శ్రీకృష్ణావతార విశిష్టతను ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు వివరించారు.

అమ్మది ఆత్మహత్యాయత్నం కాదు

- నిద్రలేమితోనే మాత్రలు తీసుకున్నారు
- గాయని కల్పన కూతురు దయ వెల్లడి

మాట్లాడుతున్న సింగర్ కల్పన కూతురు

మియాపూర్, మార్చి 5: అపస్మారకస్థితిలో దవాఖానలో చికిత్స పొందుతున్న సినీగాయని కల్పన కూతురు దయ స్పందించారు. తన తల్లిది ఆత్మహత్యాయత్నం కాదని చెప్పారు. కేవలం నిద్రమాత్రలు మోతాదుకు మించి వేసుకోవడం వల్లే అపస్మారకస్థితిలోకి చేరుకుందని చెప్పారు. బుధవారం హైదర్‌నగర్ హోలిస్టిక్ హాస్పిటల్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ తన తల్లికి నిద్రలేమి సమస్య ఉన్నదని తెలిపారు. ఇందుకోసం మాత్రలు వాడుతున్నట్టు వెల్లడించారు. ఓవర్‌డోస్ తీసుకోవడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లిందని వివరించారు. ప్రస్తుతం తన తల్లి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని తెలిపారు. తమ కుటుంబంలో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టంచేశారు.

టన్నెల్ ప్రమాదానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం

- బీజేపీ విధానాలను ఎండగట్టడంలో కాంగ్రెస్ ఫెయిల్
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ, మార్చి 5: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని, సొరంగమార్గం తవ్వేప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం విమర్శించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌తో కలిసి బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రమాదకరంగా మారబోతున్న బీజేపీ విధానాలను ఎండగట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని తెలిపారు. మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలుపొందాలని బీజేపీ చూస్తున్నదని, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

నకిలీ పురుగుమందుల విక్రయ ముఠా అరెస్ట్

రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్లు, నకిలీ లేబుళ్లు స్వాధీనం

సుబేదారి, మార్చి 5: ప్రముఖ కంపెనీల పేరుతో అన్నదాతలకు నకిలీ పురుగుమందులు విక్రయించి మోసాలకు పాల్పడిన ఐదుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్‌ఝా నిందితుల వివరాలు వెల్లడించారు. రెండు రోజుల క్రితం వరంగల్ గోపాలస్వామి గుడి ప్రాంతంలో మట్టెవాడ పోలీసులు తనిఖీలు చేస్తుండగా కారులో వెళ్తున్న కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కురుగోడుకు చెందిన కాట్రగొడ భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని, పురుగుల మందులను స్వాధీనం చేసుకొని విచారించగా నకిలీ పురుగుమందులు విక్రయిస్తున్నట్టు అంగీకరించాడు. భాస్కర్‌రెడ్డి ఇచ్చిన సమాచారంతో మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్ చర్లపల్లిలో బేయర్, టాటా, కోర్టెవా మరో నాలుగు ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ పురుగుమందులు తయారు చేస్తున్న గోడౌన్‌పై దాడులు చేశారు. హైదరాబాద్‌కు చెందిన నాగవెంకట రంగారావు, ముద్దంగుల ఆదిత్య, పిట్ట నవీన్, మిర్యాలగూడకు చెందిన దూదిమెట్ల శ్రీధర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ప్రముఖ కంపెనీల పేరు తో నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్నట్టు నిందితులు అంగీకరించారు. నిందితుల నుంచి రూ.34 లక్షలు విలువ చేసే నకిలీ పురుగుమందులు, రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్లు, నకిలీ లేబుళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తనికెళ్ల వద్ద రాజధాని బస్సు బోల్తా

పలువురు ప్రయాణికులకు గాయాలు

ఖమ్మం జిల్లా తనికెళ్ల వద్ద బోల్తా పడిన రాజధాని ఏసీ బస్సు

కొణిజర్ల, మార్చి 5: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి రాజధాని బస్సు పల్టీ కొట్టిన ఘటన ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని విజయ ఇంజినీరింగ్ కళాశాల వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సత్తుపల్లి డిపోకు చెందిన రాజధాని (ఇంద్ర) బస్సు బుధవారం హైదరాబాద్ నుంచి సత్తుపల్లి బయలుదేరింది. తనికెళ్ల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న తల్లాడ మండలం అన్నారుగూడేనికి చెందిన రవి, పెనుబల్లి మండలం భువ్వన్నపాలేనికి చెందిన సత్యనారాయణ, సత్యవతికి తీవ్ర గాయాలు కాగా మరో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎస్సై గుగులోతు సూరజ్ ఘటనా స్థలానికి చేరుకొని బస్సును క్రేన్ సహాయంతో పక్కకు జరిపి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎల్‌బీసీ సహాయ చర్యలకు మళ్లీ ఆటంకం

- పనిచేసిన కొద్దిసేపటికే మళ్లీ తెగిన కన్వేయర్ బెల్ట్
- మరమ్మతులు చేస్తేనే సహాయక చర్యల్లో పురోగతి
- సిమెంట్ సెగ్మెంట్ కూలే ప్రమాదముందని ఆందోళన

ఎస్ఎల్‌బీసీ సొరంగం నుంచి బురద, మట్టిని బయటకు తీసే కన్వేయర్ బెల్టు

నాగర్‌కర్నూల్, మార్చి 5: ఎల్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ తెలుసుకోవడం అధికారులు, సహాయబృందాలకు సవాలుగా పరీక్షగా మారింది. 12 రోజుల కిందట ఘటన జరిగితే అప్పటి నుంచి చేపడుతున్న సహాయ చర్యలేవీ ఫలితం లేకుండా పోయాయి. టన్నెల్‌లో పేరుకుపోయిన మట్టి, బురదనీటిని తొలగించేందుకు లోకో ట్రైన్ ఉపయోగించిన అధికారులు పూర్తిస్థాయిలో విజయవంతం కాలేకపోయారు. టీబీఎంకు అనుసంధానంగా ఉన్న కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు చేపట్టారు. కానీ కన్వేయర్ బెల్ట్‌తో మట్టి వెలికితీత కొన్ని గంటలు మాత్రమే సాగింది. మంగళవారం మధ్యరాత్రి 3 గంటల ప్రాంతంలో బెల్ట్ తెగిపోవడంతో సహాయ చర్యలకు మళ్లీ ఆటంకం కలిగింది. కొన్ని గంటలపాటు జరిగిన పనుల్లోనూ పెద్ద పురోగతి ఏమీలేదని తెలుస్తున్నది.

ఆచూకీ ఎప్పుడు దొరికేనో!

కన్వేయర్ బెల్ట్ తెగిపోవడంతో కార్మికుల ఆచూకీ గుర్తింపు మరిన్ని రోజులు పట్టే అవకాశం ఉన్నట్టు సహాయ బృంద సభ్యులు టన్నెల్‌లో చర్చించుకోవడం కనిపించింది. బెల్ట్‌కు మరమ్మతులు చేసేందుకు రెండు రోజులు సమయం పడుతుందని తెలుస్తున్నది. అప్పటి వరకు టన్నెల్‌లో నీటితోపాటు బురద మరింత పేరుకుపోయే అవకాశమున్నదని కార్మికులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఒక్కో షిఫ్టులో దాదాపు 100 మంది వరకు సహాయ చర్యల్లో పాల్గొంటున్నప్పటికీ కన్వేయర్ బెల్ట్ పనిచేయకపోవడంతో పనులకు ఫలితం లేకుండా పోతున్నదని రెస్క్యూటీమ్ సభ్యులు చెప్తున్నారు.

సిమెంట్ సెగ్మెంట్ కూలే ప్రమాదం!

టన్నెల్‌లో ప్రమాదం జరిగిన చోటు నుంచి అంటే 13వ కిలో మీటర్ నుంచి 14 కిలో మీటరు వరకు నాలుగు వరుసల్లో ఏర్పాటు చేసిన సిమెంట్ సెగ్మెంట్లు కూలిపడే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ ప్రమాదాన్ని బుధవారం రెస్క్యూ టీమ్ బృందాలు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు సమాచారం. ఇంత క్లిష్ట పరిస్థితుల్లో ఫలానా చోట కార్మికుల ఆచూకీ ఉండొచ్చని గుర్తించినప్పటికీ బయటకు తీసేందుకు మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. 12 రోజులైనా టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల జాడ గుర్తించలేకపోవడంతో కార్మికుల కుటుంబాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

8న జాతీయ లోక్‌అదాలత్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తేతెలంగాణ) : జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ 8న లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి బుధవారం వెల్లడించారు. ఇందులో బ్యాంకు, ఇన్సూరెన్స్, సివిల్, కుటుంబ వివాదాలతోపాటు జరిమానా విధించదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఇప్పటికే కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇక్కడ పరిష్కరించుకున్నట్టయితే కోర్టు ఫీజును వాపసు పొందవచ్చని తెలిపారు. కక్షిదారులు, బ్యాంకులు, బీమా సంస్థలు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎయిర్‌పోర్టు భూ నిర్వాసితులకు నోటీసులు

కరీమాబాద్, మార్చి 5: వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి తమ భూములను ఇచ్చేందుకు సుముఖంగా లేమని ఇటీవల పలువురు రైతులు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయా రైతులకు నోటీసులు ఇచ్చి, భూమిని ఇవ్వమనడానికి గల కారణాలను తెలుపాలని పేర్కొన్నారు. రైతులు తమ అభిప్రాయాలను అధికారులకు తెలియజేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. సమస్యల పరిష్కారం కోసం కమిటీని సైతం ఏర్పాటు చేసుకోనున్నట్టు సమాచారం.

సొంతూరుకు మలాలా

కాల్పుల ఘటన తర్వాత ఇదే తొలిసారి

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ తొలి నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జాయ్ బుధవారం తన సొంతూరుకు వెళ్లారు. వాయువ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా, షాంగ్లా జిల్లా, బర్కానాకు ఆమె హెలికాప్టర్‌లో వెళ్లారు. అక్కడ ఆమె అంకుల్ రంజాన్, ఇతర కుటుంబ సభ్యులను కలిశారు. ఆయనకు ఇటీవల ఇస్లామాబాద్‌లో గుండె శస్త్ర చికిత్స జరిగింది. ఆమె ఏర్పాటు చేసిన పాఠశాల, పురాతన శ్మశాన వాటికను కూడా ఆమె సందర్శించారు. ఆమెపై తాలిబన్లు కాల్పులు జరిపిన తర్వాత తన సొంతూరుకు వెళ్లడం ఇదే తొలిసారి. ఆమెతో పాటు ఆమె తండ్రి జియావుద్దీన్, భర్త అసీర్ మాలిక్ కూడా ఉన్నారు.

నకిరేకల్ ఎమ్మెల్యేకు న్యూడ్ కాల్!

- డబ్బుల కోసం సైబర్ నేరగాళ్ల బ్లాక్‌మెయిల్
- స్పందించకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులకు వీడియోలు షేర్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్‌లో విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మార్చి 5 : నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి మంగళవారం అర్ధరాత్రి మధ్యప్రదేశ్ నుంచి సైబర్ నేరగాళ్లు న్యూడ్ కాల్ చేశారు. వాట్సాప్‌లో తెలియని నంబర్ నుంచి వీడియో కాల్ రావడంతో కాల్ లిఫ్ట్ చేయగా, అవతలి వైపు నుంచి ఒకరు నగ్నంగా కనిపిస్తూ స్క్రీన్ రికార్డింగ్ చేశారు. అనంతరం ఆ వీడియోను ఎమ్మెల్యే వీరేశం వాట్సాప్‌కు పంపి డబ్బులు పంపించాలని బ్లాక్ మెయిల్ చేశారు. ఆయన స్పందించకపోవడంతో అదే వీడియోను వీరేశం కాంటాక్ట్స్‌లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పంపారు. వాళ్లంతా ఎమ్మెల్యేకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆయన షాక్ తిన్నాడు. వెంటనే నకిరేకల్ టౌన్ సీఐ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. సైబర్ సెల్ ద్వారా ఆయన సైబర్ క్రిమినల్ నంబర్‌ను బ్లాక్ చేయించారు. బుధవారం నకిరేకల్ పట్టణంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. వీఐపీలు టార్గెట్‌గా సైబర్ నేరగాళ్లు బ్లాక్ మెయిల్ దందాకు దిగుతున్నారని, ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల నుంచి వీడియో కాల్స్ వ